తెలంగాణ
ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ | గురువారం | 12 - 03 - 2026 | ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి | పేజిలు : 2

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

## మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేందర్‌నాథ్



- ఎమ్మెల్యేలు పార్టీ మారినట్టు కళ్ల ముందు ఆధారాలు కనిపిస్తున్నా స్పీకర్ క్లీన్‌చీట్ ఇవ్వడం అన్యాయం
- ఎమ్మెల్యేలు దానం, కడియం సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు
- వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం

**ప్రజావారధి/మోత్కూరు**

పార్టీ మారిన ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్‌చీట్ ఇవ్వడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేందర్‌నాథ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ మారి కాంగ్రెస్‌లో చేరారని, వారు పార్టీ మారినట్టు స్పీకర్‌కు బీఆర్ఎస్ అన్ని ఆధారాలు ఇచ్చిందని, కళ్ల ముందు నిజాలు కనిపిస్తున్నా స్పీకర్ ప్రభుత్వ ఒత్తిడికి లొంగి పార్టీ మారినట్టు ఆధారాలు లేవంటూ ఫిర్యాదులను డిస్మిస్ చేయడం అన్యాయమన్నారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ 2024లో కాంగ్రెస్ బీఫాంపై సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయాడని, స్టేషన్‌ఘనపూర్ నుంచి గెలిచిన కడియం శ్రీహరి కాంగ్రెస్ నుంచి వరంగల్ ఎంపీగా ఆయన బిడ్డ కావ్య పోటీ చేయగా ఆమెను గెలిచిపేందుకు కడియం కాంగ్రెస్ కండువా కప్పుకుని ప్రచారం చేశారని తెలిపారు. అన్ని ఆధారాలతో బీఆర్ఎస్ పార్టీ ఫిరాయింపు చట్టం కింద వారిపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఫిర్యాదు చేసిందని తెలిపారు. అన్ని ఆధారాలు కళ్ల ముందు కనిపిస్తున్నా పార్టీ మారినట్టు ఆధారాలు లేవని స్పీకర్ తీర్పు ఇవ్వడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం, కడియం సిగ్గు లేకుండా సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి రెండేళ్లలో ప్రజలకు చేసిందేమీ లేదని, రైతుబంధు ఎగ్గొట్టారని, రుణమాఫీ చేయలేదని, పింఛన్లు పెంచలేదని, మహిళలకు రూ.2500 ఇవ్వలేదన్నారు. భూములు లాక్కోవడానికి పేదల ఇండ్లు కూలగొడుతున్నారని, ప్రజా ధనం, భూములు లాక్కోవడంపైనే సీఎం, మంత్రులు ఫోకస్ పెట్టారని ఆరోపించారు. సీఎం, మంత్రులు తెలంగాణ సంపదను దోచుకుని తమ పదవులు కాపాడుకోవడానికి ఢిల్లీకి మూటలు పంపుతున్నారని విమర్శించారు. రైతుబంధు ఇవ్వడానికి పైసలు లేవని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి గాంధీ విగ్రహం పెట్టేందుకు రూ.5 వేల కోట్లు, కేరళ ఎన్నికలకు రూ.వెయ్యి కోట్లు ఇచ్చేందుకు ఎక్కడివని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
గురువారం
జనరల్ న్యూస్
12 - 03 - 2026


# ప్రజా సమస్యలు పరిష్కరించి అభివృద్ధి చేస్తాం




- మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య
- వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న

**ప్రజావారధి/మోత్కూరు**
మున్సిపాలిటీలో ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు వార్డులను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య, వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో 5వ వార్డులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామని, ప్రజలు కూడా ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చన్నారు. పారిశుధ్యం, తాగునీరు, వీధి లైట్లు తక్షణ సమస్యలుగా పరిష్కరిస్తామన్నారు. సీసీ రోడ్లు, మురికి కాల్వలు నిర్మించేందుకు వార్డుల వారీగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయాలని కోరారు. సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మొగుళ్ల అనురాధ, మున్సిపల్ కమిషనర్ కె.సతీష్‌కుమార్, మేనేజర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

